రైతుల ఘోష.. సర్కారుకు తమాషా!

- అధిక వర్షాలు, కరువుతో పొదిలి మండలంలో దెబ్బతిన్న పంటలు
- 660 హెక్టార్లలో వివిధ రకాలకు పంటలకు నష్టం
- గత ప్రభుత్వంలో మంజూరు చేసిన పరిహారం నేటికీ అందించని వైనం
- రూ.60 లక్షల మేర పరిహారం కోసం 1160 మంది రైతుల ఎదురుచూపులు



కొండాయపాలెంలో వర్షానికి దెబ్బతిన్న సజ్జ పంటను పరిశీలిస్తున్న మంత్రి డోలా, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల (ఫైల్)

పొదిలి రూరల్: ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోయిన రైతులు పరిహారం కోసం దీనంగా ఎదురు చూస్తున్నారు. నష్టం అంచనా జాబితాలు ప్రభుత్వానికి చేరి నెలలు గడుస్తున్నా పరిహారం నగదు అందించకుండా మీనమేషాలు లెక్కిస్తుండటంతో రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. చంద్రబాబునాయుడు ఎప్పుడు అధికారంలో ఉన్నా రైతులు, వ్యవసాయంపై నిర్లక్ష్యం చూపుతారనేందుకు పరిహారం మంజూరులో జాప్యమే నిదర్శనమని రైతులు విమర్శిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గత ఏడాది పొదిలి మండలంలో రబీ, ఖరీఫ్ సీజన్లలో సాగు చేసిన వరి, మినుము, శనగ, సజ్జ పంటలు వర్షానికి దెబ్బతిన్నాయి. దాదాపు 660 హెక్టార్లలో పంటలు దెబ్బతినడంతో 1160 మంది రైతులు నష్టపోయారు. ఈ మేరకు అప్పటి ప్రభుత్వానికి స్థానిక అధికారులు నివేదిక తయారు చేసి పంపగా రూ.60 లక్షలు మంజూరు చేశారు. అదే సమయంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రైతులకు పరిహారం నగదు పంపిణీ చేసేందుకు ఎలక్షన్ కమిషన్ మోకాలడ్డింది. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పరిహారం చెల్లింపు గురించి నేటికీ పట్టించుకోలేదు.

పరిహారం కోసం రైతుల ఎదురుచూపు

పొదిలి మండలంలోని ఆముదాలపల్లి, కుంచేపల్లి, పాములపాడు, ఏలూరు, పొదిలి, మూగచింతల, కంభాలపాడు, ఉప్పలపాడు, చింతగుంపల్లి, తలమళ్ల, మాదాలవారిపాలెం, ఓబులక్కపల్లి, నందిపాలెం, దొండ్లేరు, కొండాయపాలెం, సలకనూతల, మల్లవరం, జువ్వలేరు, తుమ్మగుంట, అన్నవరం, సూదనగుంట గ్రామాల్లో 2023- రబీ, ఖరీఫ్, 2024 ఖరీఫ్ సీజన్‌లో వరి మినుము, శనగ, సజ్జ పంటలు సాగు చేశారు. నాడు కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు నిలిచి పైర్లు దెబ్బతిన్నాయి. అలాగే తేమ శాతం పెరిగి తెగుళ్లు విజృంభించడంతో దిగుబడులు పడిపోయాయి. పంట నష్ట పోయిన తీరును వ్యవసాయాధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. రైతులను ఆదుకోవడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా అప్పటి వైఎస్ జగన్ ప్రభుత్వం నష్ట పరిహారాన్ని అందించేందుకు సిద్ధమైంది. రైతుల వ్యక్తిగత ఖాతాల్లో నగదు జమ చేసే సమయంలో ఎన్నికల కోడ్ కారణంగా అదేమీ కుదరదని ఎలక్షన్ కమిషన్ అడ్డు చెప్పడంతో చెల్లింపులు నిలిచిపోయాయి. ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం పరిహారం చెల్లింపు విషయాన్ని పూర్తిగా పక్కనపెట్టేసింది. నేటికీ పరిహారం నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ చేయకపోవడంతో 1160 మంది రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడో ఇవ్వాల్సిన నిధులను పంపిణీ చేయడానికి కూటమి ప్రభుత్వానికి చేతులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నష్టం అంచనాలు ఇలా..

- 2023-రబీ సీజన్‌లో అధిక వర్షపాతం వల్ల మండలంలో 87 మంది రైతులు 44.2 హెక్టార్లలో వరి పంట నష్టపోయారు. ఈ మేరకు నష్టం అంచనా నివేదిక గత ప్రభుత్వానికి అందడంతో రూ.7,05,536 మంజూరు చేసింది.
- అధిక కరువు వల్ల 325 మంది రైతులు 181 హెక్టార్లలో మినుము, శనగ పంటలు కోల్పోయారు. దీనికిగాను రైతులకు రూ.18,10,200 పరిహారం అందించాలని అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపగా నిధులు మంజూరు చేశారు.
- 2024లో ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షపాతంతో 748 మంది రైతులు 434 హెక్టార్లలో సజ్జ పంటను నష్టపోయారు. రైతులకు రూ.36,90,275 లక్షల పరిహారం అందించాలని అధికారులు నివేదిక పంపగా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. సజ్జ పంట దెబ్బతిన్న తీరును పరిశీలించేందుకు మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తదితరులు పొదిలి మండలంలోని కొండాయపాలెంలో పర్యటించారు. అధికారులు నివేదిక ఇస్తే ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి పరిహారం మంజూరు చేయిస్తామని చెప్పారు. కానీ, ఇంత వరకు ప్రభుత్వం నుంచి రైతులకు పైసా పరిహారం అందలేదు.

క్లుప్తంగా

ముస్తాబవుతున్న మహానేత విగ్రహాలు



తుమ్మలచెరువులో ముస్తాబవుతున్న వైఎస్సార్ విగ్రహం

తర్లుపాడు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ నెల 21న వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. వైఎస్ జగన్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు అభిమానులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ హోదాల్లోని పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలి

- సబ్ కలెక్టర్ త్రివినాగ్



ఇంధన పొదుపు ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్, విద్యుత్ శాఖ అధికారులు

మార్కాపురం టౌన్: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం డివిజన్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకుని భవిష్యత్ తరాలకు అందించాలని ప్రజలు, వినియోగదారులను కోరారు. విద్యుత్ ఆదా చేసుకుంటే ఖర్చు తగ్గడంతో పాటు భవిష్యత్‌లో ఇంధనం కోసం ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదన్నారు. విద్యుత్ శాఖ ఉద్యోగులు ఇంధన పొదుపు ఆవశ్యకతను వినియోగదారులకు వివరించారు. మార్కాపురం డివిజన్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కంభం సెంటర్ వరకు సాగింది. కార్యక్రమంలో ఈఈ పీవీ నాగేశ్వరరావు, డీఈ ఎస్.సియానాయక్, ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించేందుకే సభలు



పాములపాడులో అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్

పొదిలి రూరల్: భూసమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం పొదిలి మండలంలోని పాములపాడు రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన అర్జీల్లో సమస్య స్థాయిని బట్టి కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరిస్తామని, మిగిలిన వాటికి కొంత సమయం పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రిస్మస్ దివ్వెలు..



పట్టణంలోని ఎన్ఎస్ నగర్ వద్ద ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్

మార్కాపురం: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముందస్తు వేడుకల్లో భాగంగా మార్కాపురం పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో ఏర్పాటు చేసిన స్టార్స్ ఆకట్టుకుంటున్నాయి. మార్కాపురం పట్టణంలోని ఏబీఎం స్కూల్, కళాశాల రోడ్, స్టేషన్ రోడ్డు, పీఎస్ కాలనీతో పాటు పలు గ్రామాల్లో చర్చిల వద్ద, గృహాల వద్ద క్రిస్మస్ స్టార్స్ ఏర్పాటు చేశారు. 3 నుంచి 5 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్స్ వెలుగులు వెదజల్లుతున్నాయి. ప్రతి గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. పండుగకు కేవలం 8 రోజులు మాత్రమే సమయం ఉండటంతో క్రిస్మస్ సామగ్రి కొనుగోలు చేసి చర్చిలను, గృహాలను అందంగా అలంకరిస్తున్నారు.



దుకాణంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న క్రిస్మస్ సామగ్రి



వేములకోట వద్ద ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్

పట్టాభిరామస్వామి ఆలయంలో పూజలు

బేస్తవారిపేట: స్థానిక తేరు బజారులోని పట్టాభిరామస్వామి దేవస్థానం మహా సంప్రోక్షణ సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం వేదపారాయణ, గణపతి పూజ, కంకణధారణ, అఖండ దీపస్థాపన, ప్రధాన కలశ స్థాపన, రుద్రాభిషేకం, సాయంత్రం ఆవాహిత దేవతార్చనలు, అంకురారోహణం, అగ్నిప్రతిష్ఠాపన, లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ వాస్తు హోమాలు, సహస్ర నామ పారాయణం, మహానివేదన పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా విజయ్ దివస్



విజయ్ దివస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ సైనికులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని జై జవాన్ ఎక్స్ సర్వీస్‌మెన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సోమవారం విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. 1971 డిసెంబర్ 16న భారతదేశం పాకిస్థాన్‌తో తలపడి విజయాన్ని సాధించినందుకు గుర్తుగా విజయ్ దివస్‌ను నిర్వహించుకుంటున్నామని అసోషియేషన్ నాయకులు వాకిచర్ల శేషసాయి, సతికెల రామకృష్ణ, కృష్ణయ్య, వెంకట నారాయణరెడ్డి పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. మాజీ సైనికులు దర్శనం నాగయ్య, వెంకటరాజు, కాశిరెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

= స్థానిక కిట్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. సైనికుల త్యాగాలను కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ పీవీ అనీల్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.గనాయకులు, ఏఓ ప్రభాకర్, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ డానియేల్‌కు డాక్టరేట్ ప్రదానం

– అభినందించిన మాజీ మంత్రి సురేష్



డానియేల్‌ను అభినందిస్తున్న మాజీ మంత్రి సురేష్

మార్కాపురం రూరల్: మార్కాపురంలోని డాక్టర్ శామ్యూల్ జార్జి కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం హెచ్ఓడీగా విధులు నిర్వర్తిస్తున్న కె.డానియేల్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ సంధ్య కోల్ పర్యవేక్షణలో 'స్ట్రక్చరల్ మార్ఫలాజికల్ అండ్ ల్యూమినిసెన్స్ స్టడీస్ ఆఫ్ మెగ్నీషియం, జింక్ పాస్ఫేట్, నానో పౌడర్' అంశంపై డానియేల్ సమర్పించిన పరిశోధనా గ్రంథానికిగాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు తెలిపారు. ఆయనను మాజీ మంత్రి, కళాశాల టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ అభినందించారు.

ఎట్టకేలకు ప్రారంభమైన గ్రామ సచివాలయం



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కొమరోలు: మండలంలోని సూరవారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం ఎట్టకేలకు సోమవారం ప్రారంభమైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దాదాపు కోటి రూపాయల నిధులతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, బల్క్ మిల్క్ డెయిరీ, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల సముదాయాన్ని నిర్మించారు. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో భవనాలను అప్పటి ప్రభుత్వం ప్రారంభించలేకపోయింది. ఎన్నికల అనంతరం ఏర్పాటైన నూతన ప్రభుత్వం సచివాలయ భవన సముదాయాన్ని పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు, సచివాలయ ఉద్యోగుల వినతిపై స్పందించిన ఎట్టకేలకు స్పందించిన అధికారులు.. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చేతులమీదుగా సోమవారం ప్రారంభించారు. నూతన భవనాలు ప్రారంభించడంతో సేవలన్నీ ఒకే చోట పొందే అవకాశం ఉంటుందని సూరవారిపల్లి, బాదినేనిపల్లె గ్రామ పంచాయతీల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కామూరి అమూల్య, సర్పంచ్ ముత్తుముల జయరామిరెడ్డి, ఎంపీడీఓ మస్తాన్‌వలి, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఉపాధి హామీ ఏపీఓ మహాలక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ వీరయ్య పాల్గొన్నారు

మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కొనకనమిట్ల: మిరప పంట సాగు చేసిన రైతులు పంటలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారి డి.రమేష్ రైతులకు సూచించారు. మండలంలోని గార్లదిన్నె, కొత్తపల్లి గ్రామాల్లో మిర్చి తోటలను రైతులతో కలిసి పరిశీలించారు. పంటలో నల్ల నల్లి ముడత, కుచ్చు ముడత ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారి మాట్లాడుతూ.. నల్ల నల్లి నివారణకు స్పైరో టెట్రామెట్ లేదా స్పైనోటోరం, స్పినోసాడ్ మందును 10 రోజుల వ్యవధిలో ఒకదాని తర్వాత మరొకటి పిచికారి చేయాలన్నారు. అలాగే మినరల్ లోపం వల్ల కొత్తగా పుట్టే ఆకులు పూర్తిగా విప్పారకుండానే కుచ్చు ముడత వస్తుందని, ఇది దోమ లేదా నల్లి వల్ల వచ్చే ముడత కాదని చెప్పారు. రైతులు దోమ నివారణకు సంబంధించిన మందులు వాడినా తగ్గదని స్పష్టం చేశారు. కుచ్చు ముడత నివారణకు పై మందులతో పాటు మైక్రో న్యూట్రియన్స్ మిక్చర్‌ను ఎకరానికి 5 కిలోల చొప్పున కలిపి పంటపై పిచికారి చేయడం ద్వారా కుచ్చు ముడత తెగులును నివారించవచ్చన్నారు. ప్రస్తుత వాతావరణంలో కాయకు మచ్చ తెగులు సోకే అవకాశం ఉంది కాబట్టి వెంటనే రైతులు క్లోరోథలోనిల్(కవచ్) 250 గ్రాములు లేదా ఏంట్రకాల్ 600 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. అనంతరం కొత్తపల్లి వద్ద కల్లంలో ఆరబెట్టిన మిరప కాయలను పరిశీలించారు.



గార్లదిన్నెలో మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి

విద్యార్థినికి ఘన నివాళి

గిద్దలూరు రూరల్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న వల్పాపురి అక్షర(12) కామెర్లతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందింది. బాలిక స్వగ్రామం సంజీవరాయుడుపేటలో కుటుంబ సభ్యులను సోమవారం పాఠశాల హెచ్ఎం పి.నాగభూషణ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మధుసూదనరావు, పిడతల రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. అక్షర మృతి చెందడం బాధాకరమని, బాలిక తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



బాలిక చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

అభివృద్ధిలో పాలుపంచుకోవాలి



గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళి

కొనకనమిట్ల: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ వార్డు సభ్యులు తమ వంతు కృషి చేయాలని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు ఎంపీడీఓ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సుస్థిర అభివృద్ధి-లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి, ప్రణాళికల గురించి చర్చించారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి సూచనలు, సలహాలు అందజేయాలని వార్డు సభ్యులను కోరారు. తొలుత మహాత్మ గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేశారు. సమావేశంలో ఈఓపీఆర్డీ శ్రీదేవి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులపై ప్రజాప్రతినిధుల పెదవి విరుపు

తర్లుపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు నిర్వహిస్తున్న ఎల్ఎస్‌డీజీఎస్ శిక్షణ తరగతుల్లో అధికారుల అలసత్వంపై ప్రజాప్రతినిధులు పెదవి విరుస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్‌లకు తెలిపి ఎంపీడీఓ మధ్యాహ్నం ఒంటి గంటకు హాజరుకావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుండి కార్యక్రమం నడిపించాల్సిన ఎంపీడీఓ పనితీరుపై సర్పంచ్‌లు నిరసన వ్యక్తం చేస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం శిక్షణకు హాజరైన సర్పంచ్‌లు పలువురు గంట సేపు వేచి ఉండి ఎంపీడీఓ రాకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. దీంతో శిక్షణ కార్యక్రమం కొద్దిమందితోనే మొక్కుబడిగా సాగింది. కాగా మండలంలోని పలువురు సర్పంచ్‌లకు శిక్షణ విషయం కూడా తెలీకపోవడం గమనార్హం. కాగా ఎంపీపీ భూలక్ష్మి శిక్షణకు హాజరై పలు సూచనలు చేశారు. ఏఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

- మార్కాపురం డీఎస్పీ నాగరాజు



మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు, పక్కన సీఐ సుబ్బారావు, ఎస్సైలు

మార్కాపురం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ యు.నాగరాజు సూచించారు. సోమవారం మార్కాపురం పట్టణంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంలో భాగంగా 300 ఆటోలకు సైబర్ నేరాలు జరుగుతున్న తీరుపై తయారు చేసిన ఫ్లెక్సీలను అంటించి ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లో వివిధ రకాల మెసేజ్‌లు, యాప్‌లు, ఏపీకే ఫైల్స్‌ను సైబర్ నేరగాళ్లు పంపుతున్నారని, వాటిని తెలీక ఓపెన్‌చేస్తే సెల్‌ఫోన్‌ను హ్యాక్‌చేసి డబ్బులు దోచుకుంటున్నారని వివరించారు. మరికొంత మంది వాట్సప్ కాల్స్ ద్వారా ఫోన్ చేసి డిజిటల్ అరెస్టు పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఇలాంటి ఫేక్ కాల్స్, ఫేక్ మేసేజ్‌లను పట్టించుకోవద్దని, ఎవరైనా బెదిరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సైబర్ నేరాలపై ఇటీవల కళాశాలలు, పాఠశాలలకు వెళ్లి అవగాహన కల్పించామని, ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ సుబ్బారావు, ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు, అంకమరావు, వివిధ ఆటో యూనియన్ల నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.